సాక్షి
సంగారెడ్డి

మంగళవారం। 16 । సెప్టెంబర్ । 2025



పోషక లోప నివారణ..

పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 17 నుంచి పోషణ మాసోత్సవాన్ని నిర్వహించనున్నారు. వివరాలు 8లో ▸



కరెంట్ వైరు లాగుతుండగా..

నర్సాపూర్‌లో కరెంట్ వైరు లాగుతుండగా ఇద్దరు విద్యుత్ కార్మికులకు షాక్ గుర్రై తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలు 8లో ▸



గ్రామీణ రోడ్లు గుంతలమయం

మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లు గుంతలమయంగా మారాయి. వివరాలు 9లో ▸

అద్దెకిస్తే ఖాళీ చేయిస్తాం

కొల్లూరు డబుల్ ఇళ్లపై అధికారులు

- 700 గృహాలు అద్దెకిచ్చినట్లు అంచనా
- 552 గృహాలకు తాళం వేసుకుని వెళ్లిపోయిన లబ్ధిదారులు
- డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల వివరాల నమోదుకు ప్రత్యేక యాప్



కొల్లూరు డబుల్‌బెడ్ రూం టౌన్‌షిప్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొల్లూరు డబుల్‌బెడ్‌రూం టౌన్‌షిప్‌లో గృహాలు వందల సంఖ్యలో ఖాళీగా ఉంటున్నట్లు అధికారులు గుర్తించారు. సకల హంగులతో నిర్మించిన ఈ గృహాలను తీసుకున్న లబ్ధిదారులు ప్రస్తుతం అందులో నివాసముండటం లేదని గుర్తించారు. ఇలా ఒకటి కాదు, రెండుకాదు..ఏకంగా 552 డబుల్‌బెడ్‌రూం గృహాలు ఖాళీగా ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఈ గృహాలను పొందిన లబ్ధిదారులు తమ ఇళ్లకు తాళం వేసుకుని వెళ్లిపోయినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. మరి కొందరు లబ్ధిదారులు తమ గృహాలను ఇతరులకు అద్దెకిచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఇలా సుమారు 700లకు పైగా ఈ డబుల్‌బెడ్‌రూం గృహాల్లో లబ్ధిదారులు కాకుండా, ఇతరులు నివాసముంటున్నట్లు అంచనా వేశారు. అద్దెకుంటున్నవారిని ఖాళీ చేయిస్తామని గృహ నిర్మాణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. నిరుపేదలు నివాసం ఉండేందుకు ఇచ్చిన గృహాల్లో కేవలం లబ్ధిదారులు మాత్రమే నివాసముండాలని హౌసింగ్ పీడీ చలపతిరావు పేర్కొన్నారు.

'డబుల్'కోసమే ప్రత్యేక యాప్..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డబుల్ బెడ్‌రూం గృహాల కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వివరాలను ఈ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఎక్కడ నిర్మించారు? లబ్ధిదారుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కుటుంబసభ్యుల వివరాలు ఇలా అన్నీ ఈ యాప్‌లో నమోదు చేస్తామని గృహ నిర్మాణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయా గృహాల్లో నివాసముంటున్న లబ్ధిదారుల ఫొటోలు, వీడియోలను కూడా ఈ యాప్‌లో పొందుపరుస్తామని ఈ శాఖ అధికారులు చెబుతున్నారు.

హైస్కూల్ లేక ఇబ్బందులు

సుమారు 60 వేలమంది నివాసముంటున్న ఈ టౌన్‌షిప్‌లో ఒక్క హైస్కూల్ కూడా లేదు. దీంతో ఈ లబ్ధిదారుల పిల్లలు దూరప్రాంతానికి వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ఆర్థికసాయంతో ఇక్కడ 23 గదులతో ఓ హైస్కూల్‌ను నిర్మించాలని అధికారులు యోచిస్తున్నారు. రూ.4.5 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఈ పాఠశాలను నిర్మించేందుకు అనుమతులు తీసుకుంటున్నారు. అలాగే రేషన్‌షాపు కూడా ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రూ..1,432కోట్ల వ్యయంతో నిర్మాణం



కొల్లూరు డబుల్‌బెడ్‌రూం టౌన్‌షిప్‌లో తాళం వేసి ఉన్న గృహం

నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇంటి కలను నిజం చేసేందుకు గత ప్రభుత్వం కొల్లూరు వద్ద ఆసియాలోనే అతిపెద్ద టౌన్‌షిప్‌ను నిర్మించిన సంగతి తెలిసిందే. రూ.1,432 కోట్ల వ్యయంతో 145 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 15,560 గృహాలను నిర్మించారు. అప్పట్లోనే లబ్ధిదారులకు అందజేశారు. సుమారు 60 వేలమంది నివాసముండేలా మొత్తం 117 బ్లాకులుగా జీ ప్లస్ 9, జీ ప్లస్ 10, జీ ప్లస్ 11 అంతస్తులు నిర్మించారు. ఒక్కో బ్లాక్‌కు రెండు లిఫ్టులు, మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంట్లు, వాణిజ్య సముదాయం కూడా నిర్మించారు. తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా ఇలా మౌలిక సదుపాయాలన్నిటినీ కల్పించి లబ్ధిదారులకు అందజేశారు. అయితే ప్రస్తుతం వందల సంఖ్యలో లబ్ధిదారులు ఇందులో నివాసముండటం లేదని తేలింది.

అంగన్‌వాడీల్లోనే ప్రీ ప్రైమరీ

- సీఐటీయూ డిమాండ్
- మంత్రి దామోదర ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీ ఉద్యోగులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీలను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ ఉద్యోగులు సంగారెడ్డిలో మంత్రి దామోదర రాజనర్సింహ ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌తోపాటు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తెచ్చిందన్నారు. ఇంతటి ప్రమాదకరమైన విధానాలకు వ్యతిరేకంగా నిలబడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, కానీ, కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. ప్రీప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పచెప్తే నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని అంగన్‌వాడీ ఉద్యోగులు స్పష్టం చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, అప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా తక్షణమే రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మంత్రి పీఏ హన్మండ్లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు శశికళ, మంగా నాయకులు ఏసుమణి, మంజుల, భ్రమరాంబ, కల్పన,జమున, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ నాయకులతో కలసి మంత్రి దామోదర ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీ ఉద్యోగులు



సంగారెడ్డి చౌరస్తా సమీపంలో ఒక్క రెమ్మ కూడా లేకుండా కొట్టిన చెట్టు

అడ్డొస్తుందని.. అడ్డంగా నరికేశారు

విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ కేబుల్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మ రెమ్మలను తొలగించాల్సి ఉండగా ఏకంగా చెట్లనే అడ్డంగా నరికేస్తున్నారు విద్యుత్ సిబ్బంది. సంగారెడ్డి చౌరస్తా సమీపంలో ఒక్క కొమ్మ కూడా లేకుండా ఇలా నరికేవేయడంతో పచ్చదనం, నీడనిచ్చే చెట్లు లేకుండా పోయాయని స్థానికులు మండిపడుతున్నారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

న్యూస్‌రీల్

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

తహసీల్దార్ కార్యాలయం వద్ద పీడీఎస్‌యూ ఆందోళన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ చేసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ...ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ క్రమం తప్పకుండా విడుదల చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయడం లేదన్నారు. దీంతో ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పూర్తి పరిహారం అందించాలి



సిగాచి బాధిత కుటుంబ సభ్యులతో కలసి ఆందోళన చేస్తున్న నాయకులు

సంగారెడ్డి జోన్: సిగాచి పరిశ్రమ ప్రమాద బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం వెంటనే అందించాలని కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతి చెందినా ఇప్పటివరకు యాజమాన్యాన్ని ఎందుకు అరెస్టు చేయలేదన్నారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రమాద బాధితులకు ముఖ్యమంత్రి రూ.కోటి పరిహారం ఇస్తామని ప్రకటించినా ఇప్పటివరకు పరిహారం అందలేదని మండిపడ్డారు.

వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి

డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట ప్రభుత్వ హాస్పిటల్‌ను వందపడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌చేసి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్‌చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని సందర్శించి అక్కడి సమస్యలను రోగులు, సహాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రోగులకు సరిపోను పడకలు లేక మెరుగైన సదుపాయాలు లేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారన్నారు.

భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్గోయి రైతులు, సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: నిమ్జ్‌కోసం ఝరాసంగం మండలంలోని ఎల్గోయి గ్రామంలో 195 ఎకరాల భూసేకరణకు వేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైతులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ రైతులు చేస్తున్న ధర్నాకు సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ...సారవంతమైన, బహుళ పంటలు పండే వ్యవసాయ భూములను పరిశ్రమల పేరుతో బలవంతంగా లాక్కోవడం సరికాదన్నారు.

స్వచ్ఛత ఈ సేవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే స్వచ్ఛత ఈ సేవ–2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సంగారెడ్డి జోన్:



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజావాణికి 27 ఫిర్యాదులు

సంగారెడ్డి జోన్: తమ సమస్యలు చెప్పుకునేందుకు కలెక్టరేట్‌లో అర్జీదారులు బారులుదీరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్య తోపాటు ఇతర అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ మేరకు 27 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి పాల్గొన్నారు.

మా పేర్లతో పట్టాలు చేయాలి



న్యాల్‌కల్ మండల పరిధిలోని మిరియంపూర్ గ్రామంలో గత 30 ఏళ్లుగా 27 మంది రైతులం. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో చెట్లను పెంచుతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని తమ పేర్లపై పట్టా చేయాలని కోరుతున్నాం.

– రైతులు, మిరియంపూర్, న్యాల్‌కల్ మండలం

నెట్‌వర్క్ నిర్మాణ పనులు ఆపాలి



పట్టణంలోని భవానీనగర్ కాలనీలో అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న నెట్‌వర్క్ నిర్మాణ పనులు ఆపాలి. ఫిర్యాదు చేయగా వెంట నే పనులు ఆపాలని ఆదేశించారు. అధికారులు వెళ్లగానే ఇలా తిరిగి పనులు కొనసాగిస్తున్నారు. చర్యలు తీసుకోవాలి.

– కాలనీవాసులు, భవానీనగర్, సంగారెడ్డి

నిరుపయోగంగా ఏడీఏ కార్యాలయం

లక్షల నిధులు వెచ్చించి.. అసంపూర్తిగా వదిలిన వైనం



అసంపూర్తిగా ఉన్న ఏడీఏ కార్యాలయ భవనం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలో వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నిధుల కొరత కారణంగా వినియోగంలోకి రాకుండాపోయింది. దీంతో అర్జీలు ఇచ్చేందుకు వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జహీరాబాద్ భవానీ మందిరం రోడ్డులో రాచన్నపేట ఉన్న వ్యవసాయశాఖ డివిజన్(ఏడీఏ) కార్యాలయం నిరుపయోగంగా మారింది. దశాబ్దాల క్రితం నిర్మించిన కార్యాలయం భవనం దెబ్బతింది. ఏడీఏ కార్యాలయం పక్కనే ఉన్న గోదాం స్థానంలో నూతన ఏడీఏ కార్యాలయం నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తి ప్రారంభంలో భవన నిర్మాణ పనులు శరవేగంతో చేపట్టారు. ఇంకా కరెంట్, కలర్, లైట్స్, ప్రహరీగోడ తదితర పనులు మిగిలిపోయాయి. నిధుల కొరత వల్ల సదరు కాంట్రాక్టు పనులు అసంపూర్తిగా వదిలేశారు. మరో రూ.10 లక్షలు ఖర్చుచేస్తే ఏడీఏ కార్యాలయ భవనం వినియోగంలోకి వస్తుందన్నారు. అయితే గతేడాది జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పరిశీలించారు. పంచాయతీ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. కానీ, ఇంతవరకు నిధులు మంజూరు కాకపోవడంతో ఆ కార్యాలయం అసంపూర్తిగా ఉంది.

పంట నష్టం 5,548 ఎకరాలు

- అత్యధికంగా పత్తి పంటకు నష్టం
- ప్రభుత్వానికి అధికారుల నివేదిక

సంగారెడ్డి జోన్: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లావ్యాప్తంగా 5,548 ఎకరాల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు వ్యవసాయాధికారులు వెల్లడించారు.

20 మండలాల్లో 4,706 మంది రైతులు

జిల్లాలో 20 మండలాల్లో 4,706 మంది రైతులు పంట పొలాల్లో నష్టం వాటిలినట్లు అధికారులు లెక్క తేల్చారు. ఇందులో అత్యధికంగా పత్తి పంటకు నష్టం జరగగా సోయాబీన్, వరి, మొక్కజొన్నతో పాటు పప్పు దినుసులు దెబ్బతిన్నాయి. పెసర, మినుము పంటలు కోతదశలో వర్షాలు కురవడంతో రంగు మారి దెబ్బతిన్నాయి.

పరిహారం కోసం ఎదురుచూపులు

కురిసిన వర్షాలకు రైతులు తీవ్రస్థాయిలో నష్టపోయారు. అదేవిధంగా సాగులో ఉన్న పంటలకు సైతం తెగుళ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం ఎప్పుడు అందుతుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు.



వరదలో మునిగిపోయిన పత్తి పంట

ప్రభుత్వానికి నివేదికలు

నష్టపోయిన పంటల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. త్వరలోనే నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సంగారెడ్డి

సింగూరు నీరు విడుదల

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో మూడు గేట్‌లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టుకు ఎగువన భారీ వర్షాలు కురవడంతో భారీ వరదలు వస్తోంది. దీంతో 8,9,10 నంబర్ గేట్‌లను మీటరున్నర పైకి ఎత్తి 23,230 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జలవిద్యుత్ కేంద్రం ద్వారా రెండు టర్బయిన్‌లను రన్‌చేసి 2,500 క్యూసెక్కుల నీటిని వినియోగించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 17,500 టీఎంసీల నీటిని ఉంచి మిగతా నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

నిరుద్యోగులకు వరంగా డీట్

ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ కార్యాలయాలు కీలకపాత్ర పోషించేవి. జిల్లా ఉపాధి కేంద్రాల్లో నమోదైన సీనియారిటీని బట్టి ఉద్యోగ సమాచారాన్ని అభ్యర్థులకు అందజేసేవి. కాలక్రమేణా వచ్చిన మార్పులకనుగుణంగా ప్రైవేటు ఉద్యోగాల ఇన్ఫర్మేషన్‌ను కూడా డిజిటల్ రూపంలో అందజేసేందుకు రాష్ట్రప్రభుత్వం రూపొందించిన 'డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ'(డీట్) యాప్ ఇప్పుడు నిరుద్యోగుల పాలిట వరంగా మారింది.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి):

నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ'(డీఈఈటీ/డీట్) యాప్‌ను తీసుకొచ్చింది. విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థల సమన్వయంతో రూపొందిన ఈ ఏఐ ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫాం నిరుద్యోగులకు నమ్మకమైన ఉద్యోగావకాశాలను కల్పిస్తోంది. ఈ యాప్‌తో యువత బోగస్ కంపెనీలు, మోసగాళ్ల బారిన పడకుండా ఉద్యోగావకాశాలు పొందవచ్చు.

యాప్‌లో నమోదైతే ఫోన్లకు ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం

- పదో తరగతి నుంచి పీహెచ్‌డీ చేసిన అందరూ అర్హులే
- జిల్లాలో యువత 7.20లక్షలు.. నమోదైన నిరుద్యోగులు 10,774
- జిల్లాలో దాదాపు లక్షకు పైగా నిరుద్యోగ యువత

ఖాళీల సమాచారం

డీట్‌యాప్ ద్వారా పరిశ్రమలు, కంపెనీలు తమ ఖాళీలను నిరుద్యోగుల మొబైల్‌ఫోన్లకు పంపిస్తాయి. ఈ సమాచారంలో విద్యార్హతలు, వేతన వివరాలు, ఖాళీల సంఖ్య, మౌఖిక, రాత పరీక్షల వివరాలు ఉంటాయి. ఈ విధంగా సమగ్ర సమాచారం అందిన నిరుద్యోగులు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. యాప్‌కు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను అనుసంధానం చేశారు. దీంతో ఇది మరింత సమర్థవంతంగా, వేగవంతంగా సేవలను అందిస్తోంది. పదో తరగతి నుంచి ఎంఫిల్, పీహెచ్‌డీ విద్యార్హతలు కలిగినవారు ఎవరైనా ఈ యాప్‌లో నమోదుకావచ్చు. ఒక్కసారి రిజిస్టర్ చేసుకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ ప్రైవేట్ రంగంలో ఖాళీలున్నా వారి అర్హతల ఆధారంగా ఉద్యోగ సమాచారం లభిస్తుంది.



ప్రయోజనాలివే...

- నమ్మకంగా ఉద్యోగ అవకాశాలను కల్పించడం
- జాబ్ మేళాలు, రిక్రూట్ మెంట్ డ్రైవ్‌లలో పాల్గొనే అవకాశం.
- మోసపూరిత కంపెనీల భయం లేకుండా ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

వినియోగించుకోవాలి

నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. డీట్‌లో నమోదు చేసుకున్న యువతకు ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లోని కంపెనీల్లోని ఉద్యోగ ఖాళీల వివరాలు ఎప్పటికప్పుడు వారి ఫోన్లకు నోటిఫికేషన్లు అందుతాయి. వాటి ఆధారంగా ఉద్యోగ ప్రయత్నాలు చేసుకోవచ్చు.

– తుల్జా నాయక్, జిల్లా పరిశ్రమల అధికారి(జీఎం)

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా...

ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ నుంచి లేదా గూగుల్‌ప్లే స్టోర్ నుంచి డీట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పేరు, పుట్టినతేదీ, సెల్‌నంబర్, ఈమెయిల్‌ఐడీ, విద్యార్హతలు, టెక్నికల్ కోర్సులు, వ్యక్తిగత వివరాలను నమోదు చేయాలి. ఆశించే ఉద్యోగరకం, పనిచేయాలనుకునే ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలి.

- వివిధ నైపుణ్యాలు, అర్హతలు కలిగిన అభ్యర్థులకు తగిన ఉద్యోగాలను సూచిస్తుంది.
- కేంద్రీకృత ప్లాట్ ఫామ్ ద్వారా నిరంతర నియామక ప్రక్రియలు.
- పరిశ్రమ నిర్దిష్ట నైపుణ్య అవసరాలను తీర్చడానికి తగిన శిక్షణ కార్యక్రమాలు.
- అభ్యర్థికి ఎంపిక విధానం, ప్లేస్‌మెంట్ ప్రయత్నాలకు నిరంతర మద్దతుగా నిలవడం.

క్లుప్తంగా

మెదక్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణమూర్తి



జిల్లా ఎస్పీని కలిసిన కృష్ణమూర్తి

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావును మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి బాధ్యతలను కూడా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తికి అప్పగించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. అలాగే పేకాట, గ్యాంబ్లింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అణచివేయాలని సూచించారు.

జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని పలు కళాశాలలు, హాస్టళ్లకు చెందిన విద్యార్థినులు జ్వరంతో బాధపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో హాస్టళ్ల భవనాల చుట్టూ మురుగు నీరు నిలిచి దోమలతో సతమతమవుతున్నారు. దీంతో చాలామంది విద్యార్థులు జలుబు, జ్వరంతో బాధపడుతున్నారు. కాగా గురుకుల డిగ్రీ హాస్టల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు జ్వరంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

విద్యుత్ వైరు కాళ్లకు తాకి..

– షాక్‌తో రైతు మృతి



మిన్‌పూర్ శేఖర్

పాపన్నపేట(మెదక్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మిన్‌పూర్ శేఖర్(30)పొలానికి వెళ్తూ.. హైదరాబాద్‌లో ఉంటున్న తన తమ్మునితో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో తెగి పడిన విద్యుత్ వైరును చూడకపోవడంతో కాళ్లకు తగిలింది. షాక్ కొట్టగానే అరుస్తూ కిందపడ్డాడు. ఫోన్‌లో అన్న అరుపు విన్న తమ్ముడు అప్రమత్తమై కుటుంబీకులకు చెప్పాడు. వెంటనే వాళ్లు పొలం వద్దకు వెళ్లి కొన ఊపిరితో ఉన్న శేఖర్‌ను మెదక్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య యశోద, కొడుకులు ప్రదీప్, హర్షవర్ధన్ ఉన్నారు.

పోక్సో కేసులో ఒకరికి జైలు

పెద్దశంకరంపేట(మెదక్): పోక్సో కేసులో కోర్టు ఒకరికి 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమాన విధించింది. ఎస్‌ఐ.ప్రవీణ్‌రెడ్డి వివరాల ప్రకారం... మండల పరిధిలోని మాడ్చెట్‌పల్లి గ్రామానికి చెందిన నిందితుడు తలారి మోహన్ 2020లో ఎనిమిదేళ్ల బాలికకు చాక్లెట్ ఆశ చూపి అత్యాచారం చేశాడు. దీంతో అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ పూర్తి కావడంతో మెదక్ ఫాస్ట్రాక్ కోర్టు జడ్జి నీలిమ నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమాన విధించినట్లు పోలీసులు తెలిపారు.

కొండముచ్చుల దాడిలో వ్యక్తికి గాయాలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో సోమవారం కొండముచ్చులు వ్యక్తిపై దాడి చేశాయి. ఈ దాడిలో శాంతినగర్‌కు చెందిన అమర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల క్రితం రాంనగర్, గాంధీనగర్ ప్రాంతంలో కొండముచ్చుల గుంపు రోడ్డుపై నుంచి వెళ్తున్న ప్రజలపై దాడి చేయగా శరణమ్మ, రాజ్‌కుమార్‌లకు గాయాలైన విషయం తెలిసిందే. వరుసగా కొండముచ్చులు దాడి చేయడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోషక లోప నివారణ.. ఆరోగ్య రక్షణ

చిన్నారులు, మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. కార్యక్రమానికి జిల్లా అధికారులు సంసిద్ధులయ్యారు. జంక్‌ఫుడ్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు చెక్కెర, ఉప్పు, నూనె వాడకం పరిమితిపై ప్రచారం నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు నిత్యం ఓ కార్యక్రమం నిర్వహించేందుకు క్యాలెండర్‌ను రూపకల్పన చేశారు.

– నారాయణఖేడ్:

జిల్లాలో నారాయణఖేడ్, జోగిపేట, జహీరాబాద్, సదాశివపేట్, పటాన్‌చెరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాల్లో మూడేళ్లలోపు చిన్నారులు 55,502 మంది, 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు 49,530 మంది నమోదై ఉన్నారు. గర్భిణి స్త్రీలు 11,594, బాలింతలు 6,684 మంది కాగా, తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలు (ఎస్ఏఎం) 545, తక్కువ పోషకాహార లోపం ఉన్న పిల్లలు (ఎంఏఎం) 3,236 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చిన్నారులను పోషకాహార లోపం సమస్యల నుంచి దూరం చేసేందుకు ఈ కార్యక్రమం ద్వారా శ్రీకారం చుట్టనున్నారు. కార్యక్రమ నిర్వహణకు ప్రతీ ఐసీడీఎస్ ప్రాజెక్టుకు రూ.30వేలు, సీడీపీఓ కార్యాలయానికి రూ.50వేల చొప్పున నిధులు విడుదల చేశారు.

17 నుంచి పోషణ మాసం షురూ..

- చిన్నారులు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహణ
- నెల రోజులపాటు నిత్యం ఓ కార్యక్రమం



నారాయణఖేడ్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

నిత్యం కార్యక్రమాలు

ఈనెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు రోజుకో కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణి, పాలిచ్చే తల్లులు, శిశువులు, చిన్నపిల్లల పోషణపై సలహా సమావేశం, పౌష్టికాహారం తయారీపై వంటకాల పోటీలు, కిశోర బాలికలకు, పెద్దవాళ్ల కోసం బీఎంఐ పరీక్షలు, పిల్లల కోసం ఎత్తు, బరువు, కొలతలు తీయడం, ఆహారంలో చెక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించే విషయంపై అవగాహన కల్పించనున్నారు. తండ్రులతో పోషకాహార ప్రతిజ్ఞ, 3 ఏళ్లలోపు పిల్లల ఆరంభ అభివృద్ధి, స్థానిక ఉత్పత్తులు, బొమ్మలపై అవగాహన కల్పిస్తారు. వంటకాలు స్వయంగా తయారు చేయడం, బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టడంపై, ఆహారపు అలవాట్లు అలవర్చుకునేలా వివరిస్తారు. ఆరోగ్యవంతమైన పిల్లలు, తల్లులు, పోషణ లోపం ఉన్న వారి మధ్య అనుభవం పంచుకోవడం, చిరు ధాన్యాలు, ఫలాలు, కూరగాయలపై అతి తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లలకు పరీక్షలు, రక్తహీనత, అధిక బరువు వల్ల వచ్చే సమస్యలపై కిశోర బాలికలకు అవగాహన చేపట్టనున్నారు.



చిన్నారులు, మహిళల ఆరోగ్యం, పోషకాహారాన్ని మెరుగు పర్చే లక్ష్యంతో ప్రభుత్వం ఈ మహోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా ప్రతి ఇంటికి పోషణ సందేశం చేరవేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. పోషణ మాసంలో ప్రజాప్రతినిధులను సైతం భాగస్వాములను చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధులకు ఆ శాఖ ద్వారా లేఖలు కూడా పంపించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పోషణపై చైతన్య కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు, ఆరోగ్య పరీక్షల క్యాంపులు నిర్వహించనున్నారు. పోషణ మాసం సందర్భంగా చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు, పోషకాహారం అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

ప్రతి ఇంటికీ పోషణ సందేశం

నిర్వహణకు ఏర్పాట్లు



జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. నిర్దేశిత క్యాలెండర్ ప్రకారం నిత్యం ఓ కార్యక్రమం నెల పాటు నిర్వహిస్తాం. చిన్నారులు, మహిళలకు ఆరోగ్యంపై సంపూర్ణ అవగాహన కల్పించనున్నాం.

– లలితకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, సంగారెడ్డి

దైవదర్శనానికి వెళ్లొస్తుండగా..

- డివైడర్‌ను ఢీకొట్టి ఔటర్‌పై కారు బోల్తా
- యువతి మృతి, ఏడుగురికి గాయాలు



ఔటర్‌పై బోల్తాపడిన కారు



సౌమ్యారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ / జిన్నారం (పటాన్‌చెరు): స్నేహితులంతా కలిసి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు ఔటర్ రింగ్‌రోడ్డుపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ యువతి మృతిచెందగా ముగ్గురికి తీవ్ర, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం వావిలాల గ్రామానికి చెందిన రాళ్లకత్వ వెంకటేశ్వర్ రెడ్డి కూతురు సౌమ్యారెడ్డి (25) నగరంలోని ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. తన స్నేహితులైన నందకిశోర్, వీరేంద్ర, ప్రణీష్, సాగర్, అరవింద్, ఝాన్సీ, శృతితో కలిసి ఆదివారం కారులో రాచకొండ సమీపంలోని సరళ మైసమ్మ దేవాలయానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో రాత్రి బొంగ్లూర్ వద్ద ఔటర్‌పై నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో బలిజగూడ సమీపంలోకి రాగానే భారీగా కురుస్తున్న వర్షం కారణంగా వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో సౌమ్యారెడ్డితో పాటు పలువురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సౌమ్యారెడ్డి చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందింది. మరో ముగ్గురు తీవ్రగాయాలతో చికిత్స పొందుతుండగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా దర్శనానికి అని వెళ్లిన కూతురు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు, అక్క రమ్యారెడ్డి కన్నీరు మున్నీరయ్యారు. సౌమ్యారెడ్డి మృతితో వావిలాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



నిజాంపేట(మెదక్): మండలంలోని ఖాసీంపూర్ తండాలో సోమవారం ఓ గిరిజన వ్యక్తి మృతి చెందడంతో కూతురు తలకొరివి పెట్టింది. తండాకు చెందిన ధరావత్ చంద్రు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి కూతురు సోనీ మాత్రమే ఉంది. దీంతో అతని మృతదేహానికి కూతురు తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న సోనీ

యువకుడి బలవన్మరణం

ప్రేమ వ్యవహారమే కారణమా?

తూప్రాన్: ప్రేమ వ్యవహారంలో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం... మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లికి చెందిన కమ్మరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు నరేశ్‌చారి అలియాస్ నితిన్(22) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న నరేశ్‌చారి సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కొడుకు మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

8 గ్రాముల చరస్ పట్టివేత

జహీరాబాద్ టౌన్: మండలంలోని రాష్ట్ర సరిహద్దులో గల చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ పోలీసులు 8 గ్రాముల చరస్(మత్తు పదార్థం)ను పట్టుకున్నారు. సోమవారం సంగారెడ్డి, జహీరాబాద్ ఎక్సైజ్ అధికారులు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గోవా నుంచి వస్తున్న జీపును తనిఖీ చేయగా ఢిల్లీకి చెందిన అమర్‌జీత్ రాథే వద్ద 8 గ్రాముల చరస్ లభించింది. మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకుని జీపును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. తనిఖీలో ఎక్సైజ్ సీఐ గాంధీనాయక్, ఎస్ఐలు హన్మంత్, యాదయ్య, రమేశ్, మురళి, ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

గోవా మద్యం స్వాధీనం

గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న 17,245 లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రావెల్ బస్సులో లభించింది.

కుంటలో బాలుడి గల్లంతు



నీటి కుంటలో గాలింపు చేపట్టిన అగ్నిమాపక సిబ్బంది

జహీరాబాద్ టౌన్: ఈతకు వెళ్లిన బాలుడు కుంటలో గల్లంతయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం... కోహీర్ మండలం పిచరాగడి గ్రామానికి చెందిన రిజ్వాన్(17) స్నేహితులు సలీం, గుల్లుతో కలిసి సోమవారం హుగ్గెల్లి గ్రామ శివారులో గల కుంటలో ఈత కొట్టేందుకు వచ్చారు. రిజ్వాన్ లోతైన ప్రాంతానికి వెళ్లడంతో ఈత రాకపోవడంతో నీట మునిగాడు. ఈ ఘటనతో భయపడిన స్నేహితులు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కుంటలో గాలింపు చేపట్టారు. చీకటి పడుతున్నా బాలుడి ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గాలింపు చేపట్టనున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొన్నారు.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

విద్యార్థులకు తప్పిన ప్రమాదం



పెచ్చులూడిన పైకప్పు

అల్లాదుర్గం(మెదక్): పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాఠశాల స్లాబు పెచ్చులూడి కింద పడ్డాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి గడి పెద్దాపూర్ జెడ్పీ పాఠశాలలో చోటు చేసుకుంది. ఈ భవనాన్ని 60 ఏళ్ల క్రితం నిర్మించారు. కొన్ని గదులు రేకులతో నిర్మించగా వాటికి రంధ్రాలు పడ్డాయి. మరో రెండు గదులు సైతం శిథిలావస్థకు చేరుకొని వర్షం పడితే గదుల్లోకి నీరు చేరుతుందని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తరతిగది పెచ్చులూడి పడ్డాయి. విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రమాదాలు జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రసవానికి వెళితే పుస్తె అపహరణ

జోగిపేట ఏరియా ఆస్పత్రిలో ఘటన

జోగిపేట(అందోల్): ఆస్పత్రికి ప్రసవానికి వెళితే పుస్తెను అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. ఈనెల 13న అందోలు మండలం పోసానిపేట గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి ప్రసవం కోసం జోగిపేట ఏరియా ఆస్పత్రిలో చేరింది. సర్జరీ తప్పనిసరి కావడంతో శనివారం ఆ మహిళను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లారు. ఆపరేషన్ సమయంలో సిబ్బంది థియేటర్ ప్రక్క గదిలోకి తీసుకువెళ్లి మెడలో పుస్తె, బంగారు ఆభరణాలు(నాలుగు గ్రాములు) తీసేశారు. అదే రోజు సర్జరీ చేశారు. ఆ మహిళ ఆడపిల్లకు జన్మనిచ్చింది. సర్జరీ తర్వాత బయటకు వచ్చాక బంగారు పుస్తెను భర్తను అడుగగా తనకు ఇవ్వలేదని చెప్పాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు సిబ్బందిని అడుగగా తమకు తెలియదని చెప్పారు. ఈ వివాదం ఆస్పత్రి సూపరింటెండెంట్ సౌజన్య వద్దకు వెళ్లడంతో సిబ్బందిని పిలిచి మందలించింది. అయినా ఫలితం లేకపోవడంతో బాధితురాలి భర్త అశోక్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారం రూ.40వేల విలువ ఉంటుందని బాధితులు తెలిపారు. అయితే ఆడపిల్ల పుట్టగానే రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, రూ.వెయ్యి ఇచ్చినట్లు బాధిత మహిళ చెప్పారు.

మార్షల్‌ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం



కరాటేలో వివిధ బెల్ట్‌లు సాధించిన విద్యార్థినులు

104 మందికి బెల్ట్‌లు ప్రదానం

వర్గల్(గజ్వేల్): మార్షల్ ఆర్ట్స్ బాలికలకు ఆత్మరక్షణతోపాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందింపజేస్తాయని పూలే బాలికల గురుకుల బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం గురుకులంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు డైనమిక్ షోటోకాన్ అసోసియేషన్ బెల్ట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 104 మంది విద్యార్థులకు వారి స్థాయిలను బట్టి బ్రౌన్, పర్పుల్, బ్లూ, ఆరెంజ్, ఎల్లో బెల్ట్‌లను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శాలిని, పీడీ లోకేశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధ్యయనం



మల్కాపూర్‌లో యూపీ ప్రజాప్రతినిధుల బృందం

మల్కాపూర్‌లో యూపీ బృందం పర్యటన

తూప్రాన్: మండలంలోని ఆదర్శ గ్రామం మల్కాపూర్‌ను ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రజాప్రతినిధుల బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధ్యయనం చేశారు. తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో యూపీకి చెందిన సుమారు 20 మంది ప్రజాప్రతినిధుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్‌యార్డు, సెగ్రిగేషన్, రాక్ గార్డెన్, కమ్యూనిటీహాల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఇదే తరహాలో తమ రాష్ట్రంలో కూడా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వారి వెంట ఎంపీడీఓ సతీశ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాదులు

సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

దుబ్బాక: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని మతోన్మాదులు చరిత్రను వక్రీకరించడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో సీపీఎం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి ,వెట్టి చాకిరీ విముక్తి కోసం దున్నేవాడికే భూమి దక్కాలని దొరలు, భూస్వాములు, రజాకార్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశామన్నారు. ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలు నిర్వహించి 10 లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. ఈ సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భాస్కర్, జిల్లా నాయకులు గోపాలస్వామి, నవీన, భాస్కర్, ఎల్లయ్య, సాధిక్ పాల్గొన్నారు.

కరెంటు వైరు లాగుతుండగా..

- షాక్ కొట్టి ఇద్దరు కార్మికులకు గాయాలు
- మెదక్ జిల్లాలో ఘటన



రేకుల షెడ్డుపై పడిన సంతోష్‌ను కిందకు దించుతున్న ఫైర్ సిబ్బంది



షాక్‌కు గురై కరెంటు వైరుపై వేలాడుతున్న అనిల్

నర్సాపూర్: కరెంటు వైరు లాగుతుండగా సోమవారం ఇద్దరు కార్మికులు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలిలు ఇలా... నర్సాపూర్‌లోని ఫైర్ స్టేషన్‌కు కొత్త భవనం మంజూరు కావడంతో నిర్మాణ పనులు ఇటీవల చేపట్టారు. భవనం నిర్మిస్తున్న స్థలం మీదుగా కరెంటు వైర్లు ఉండటంతో వాటిని తొలగించి కొత్త వైరు లాగే పనులు విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టర్ స్వామికి అప్పగించారు. సోమవారం ఐదుమంది కార్మికులతో ఫైర్ స్టేషన్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి హై టెన్షన్(హెచ్‌టీ) కరెంటు సప్‌లై టవర్ మీదుగా పనులు చేపట్టారు. ఈ క్రమంలో కార్మికుడు అనిల్ హెచ్‌టీ కరెంటు సప్‌లై టవర్ వద్ద పని చేస్తుండగా మరో కార్మికుడు సంతోష్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోని స్తంభం వద్ద పనులు చేస్తున్నారు. అనిల్‌కు కరెంటు షాక్ తగలడంతో హెచ్‌టీ సప్‌లై టవర్ నుంచి మరో స్తంభానికి ఉన్న కండక్టర్ వైరుపై వేలాడాడు. సంతోష్‌కు షాక్ కొట్టడంతో పక్కనే ఉన్న దుకాణం రేకుల షెడ్డుపై పడ్డాడు. కాగా వైరుపై వేలాడుతున్న అనిల్‌ను కిందకు దించేందుకు ఫైర్ స్టేషన్ సిబ్బంది ప్రయత్నించే లోపు నేలపై పడ్డాడు. సంతోష్‌ను రేకుల షెడ్డుపై నుంచి ఫైర్ సిబ్బంది కిందకు దించారు. ఇద్దరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం అనిల్‌ను గాంధీ ఆస్పత్రికి , సంతోష్‌ను సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అనిల్ కొడిపల్లి మండలం గౌతాపూర్ తండా, సంతోష్ అదే మండలం కొత్త చెరువు తండాకు చెందిన వాడు. కాగా ఇద్దరు కొంత కాలంగా కరెంటు కాంట్రాక్టర్ల వద్ద కార్మికులుగా పని చేస్తున్నారని తెలిసింది. ఇదిలా ఉండగా.. వైరు లాగే పనులు చేపట్టేందుకు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ శాఖ ఉద్యోగి, కాంట్రాక్టర్ ఎల్‌సీ తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎల్‌సీ తీసుకుని పనులు చేపట్టారు: ఏడీఈ

ఫైర్ స్టేషన్‌కు కొత్త భవనం నిర్మించాలనుకున్న చోట కరెంటు వైర్లు ఉన్నందున వాటిని తొలగించి కొత్త వైర్లు లాగాలని ఫైర్ స్టేషన్ అధికారులు కోరారని స్థానిక ఏడీఈ రమణారెడ్డి తెలిపారు. అందులో భాగంగా కాంట్రాక్టర్ స్వామికి పనులు అప్పగించారన్నారు. స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్ శివరాం లైన్ క్లియర్ తీసుకున్న తర్వాత పనులు చేపట్టారని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు.

కమ్యూనిస్టులే.. సాయుధ పోరాట వారసులు



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ సాయుధ పోరాట వారసులు భారత కమ్యూనిస్టు నేతలేనని సీపీఐ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం మహ్మదాపూర్‌లో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించింది కమ్యూనిస్టులేనన్నారు. చరిత్ర చెరిపేస్తే పోయేది కాదని ఏడాది పాటు సాగిన సాయుధ పోరాటంలో 4,500 మంది సీపీఐ నేతలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఆనాటి సాయుధ పోరాటంను హిందు, ముస్లింలకు జరిగినట్లుగా బీజేపీ నాయకులు చిత్రీకరించి చెబుతున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చి 13 ఏళ్లు గడిచినా విమోచన దినాన్ని అధికారికంగా జరపడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, శంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.